క్లుప్తంగా

కుండపోత వర్షం



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ఆదివారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాస్తూ వచ్చి సాయంత్రం 5 గంటల సమయం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడి భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు పల్లపు రోడ్లు నీటితో నిండాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగలేదు. గత నాలుగు రోజుల నుంచి ప్రతి రోజు సాయంత్రం ఇదే విధంగా భారీ వర్షం కురుస్తూ వస్తోంది. పట్టణ పరిధిలోని యడ్లలింగయ్య కాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, ఆలపాటినగర్, సుల్తానాబాద్, పూలే కాలనీ, తదితర ప్రాంతాల్లో వర్షం నీరు రోడ్లపై ఎక్కువగా కనిపిస్తుంది. ఆ ప్రాంతవాసులు బయటకు రావడానికి కొంత ఇబ్బంది పడ్డారు.

మోహన్‌లాల్‌కు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుపై హర్షం

తెనాలిరూరల్: విలక్షణ నటుడు మోహన్‌లాల్ 2023 సంవత్సరానికి గాను దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుకు ఎంపికవడంపై మా–ఏపీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఇక్కడి పెదరావూరులోని జరిగిన సమావేశంలో మోహన్‌లాల్‌ను అభినందిస్తూ తీర్మానించినట్టు మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా తెలిపారు. మోహన్‌లాల్‌కు ఫోన్ ద్వారా అభినందనలు తెలపడంతో పాటు తీర్మానం ప్రతిని ఈ–మెయిల్ ద్వారా పంపినట్టు చెప్పారు.

వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర జట్టుకు 'మున్సిపల్' విద్యార్థులు



తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళగిరి నియోజకవర్గంలోని రేవేంద్రపాడులో శనివారం జరిగిన అండర్–17 బాలుర, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారుల్లో 9వ తరగతి విద్యార్థులు లీల నాగేంద్రబాబు, దమ్ము తేజ, బాలికల విభాగంలో పాలపర్తి హేమంబ్రద లక్ష్మీప్రసన్న ఉన్నారని హైస్కూలు హెచ్ఎం కె.భారతి తెలియజేశారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాదకుమారి, కొడాలి గోవర్ధన అభినందించారు.

జిల్లాలో సగటు వర్షపాతం 25.7 మి.మీ

కొరిటెపాడు(గుంటూరు): అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 74.2 మిల్లీమీటర్లు వర్షం కురవగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 4.2 మి.మీ వర్షం కురిసింది. సగటున 25.7 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. దుగ్గిరాల మండలంలో 57.8 మి.మీ., తాడేపల్లి 49.6, తుళ్లూరు 44.6, గుంటూరు తూర్పు 40.2, మంగళగిరి 38.2, పెదకాకాని 29.8, పెదనందిపాడు 29.2, ప్రత్తిపాడు 20, తాడికొండ 19, మేడికొండూరు 13.8, ఫిరంగిపురం 11.2, చేబ్రోలు 7.2, తెనాలి 6.8, కొల్లిపర 6.2, వట్టిచెరుకూరు 5, కాకుమాను మండలంలో 4.8 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

అమ్మవారి ఆలయాలకు దసరా శోభ

- నేటి నుంచి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు
- 11 రోజుల పాటు దసరా వేడుకలు
- రోజుకో అలంకరణలో దర్శనమివ్వనున్న అమ్మవారు
- ముస్తాబవుతున్న ఆలయాలు



బోసురోడ్డులోని శ్రీ వాసవీ అమ్మవారి దేవస్థానం

తెనాలిటౌన్: దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు దసరా పండుగ రానే వచ్చింది. విజయదశమి పండుగతో అమ్మవారి ఆలయాలకు శోభ తెచ్చింది. శరన్నవరాత్రి ఉత్సవాలకు తెనాలి నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు సుందరంగా ముస్తాబవుతున్నాయి. విద్యుత్ దీపాలంకరణలు, ఫ్లెక్సీలు అమ్మవారి ఆలయాల వద్ద రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నారు. పలు చోట్ల మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారికి విగ్రహాలు ప్రతిష్ఠించే పనిలో ఉన్నారు. 11 రోజుల పాటు రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. పట్టణంలోని బోసురోడ్డులో వేంచేసియున్న శ్రీ వాసవీ అమ్మవారి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం, దేవిచౌక్‌లోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయం, శివాజీచౌక్‌లోని ఖాళీమాత దేవాలయం, మారీసుపేట, గంగానమ్మపేటలోని బాలత్రిపుర సుందరీ దేవాలయాల్లో అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

తొమ్మిది రోజులు అలంకరణలు

దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబర్ 22న బాలత్రిపుర సుందరీ దేవి, 23న గాయత్రీదేవి, 24న శ్రీ అన్నపూర్ణా దేవి, 25న కాత్యాయని దేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలితా త్రిపుర సుందరీ దేవి, 28న మహాచండీ దేవి, 29న సరస్వతి దేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దీని, 2న రాజరాజేశ్వరి దేవి అలంకరణలో అమ్మవారు భక్తులను కనువిందు చేయనున్నారు. ఈ ఏడాది ప్రత్యేకంగా రెండు రోజులు అదనంగా ఉత్సవాలు జరపనున్నారు. ప్రతి ఏడాది 9 రోజులు మాత్రమే శరన్నవరాత్రి ఉత్సవాలు ఉండేవి. ఈ ఏడాది రెండు రోజులు ప్రత్యేకంగా వచ్చినట్లు అర్చకులు తెలిపారు.

దేవాలయాల వద్ద ప్రత్యేక చర్యలు

విజయదశమి సందర్భంగా దేవాలయాల వద్ద ప్రత్యేక శానిటేషన్, భద్రత చర్యలు, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయా దేవాలయాల ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు సంయమనం పాటించి ప్రతిరోజు జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కొత్తపేటలోని శ్రీ అష్టలక్ష్మీ దేవాలయం



కరెవరంలోని శ్రీ దుర్గామల్లేశ్వరి అమ్మవార్ల దేవస్థానం



విద్యుత్ దీపాలంకరణలో దేవిచౌక్‌లోని రాజరాజేశ్వరి దేవి దేవస్థానం



శివాజీ చౌక్‌లోని కాళీమాత దేవస్థానం

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని దేవీచౌక్‌లో వేంచేసి ఉన్న శ్రీరాజరాజేశ్వరి దేవి అమ్మవారి 94వ శరన్నవ రాత్రోత్సవాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ టీవీఎస్ శాస్త్రి, ఇతర పాలకవర్గ బాధ్యులు ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. వివరాలను తెలియజేశారు. అక్టోబరు 2వ తేదీవరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున అమ్మవారు శ్రీరాజరాజేశ్వరదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. వరుసగా గాయత్రీదేవి, అన్నపూర్ణ దేవి, సంతానలక్ష్మీదేవి, ధనలక్ష్మీదేవి, మహాదుర్గా దేవి, మహావారాహినిదేవి, మహాసరస్వతి, మహాకాళీదేవి అవతారాలతో, పదోరోజున మహిషాసుర మర్దినిగా, విజయదశమినాడు శ్రీపుష్పశయినిగా భక్తులకు దర్శనమిస్తారని తెలియజేశారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటలకు బాల పూజ, మధ్యాహ్నం ఒంటిగంటకి శ్రీచక్ర అర్చన, రాత్రి ఏడు గంటలకి తీర్థ ప్రసాద వినియోగం, 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. విజయదశమి రోజు సాయంత్రం సెమీపూజ తదుపరి అమ్మవారు పుర వీధుల్లో రథోత్సవంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అక్టోబర్ 3వ తేదీ ఉదయం 9 గంటలకు రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయని చెప్పారు. కమిటీ ఉపాధ్యక్షుడు చివుకుల శివరాం ప్రసాదు, కోశాధికారి ధారా బాలకృష్ణమూర్తి, సభ్యులు పోలేపెద్ది రామకృష్ణ, అన్నదానం కమిటీ సభ్యులు, కొండపి శ్రీనివాసరావు, కాజ శివ ప్రసాదు, జొన్నలగడ్డ సూర్యభగవాన్ పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరించిన ఆలయ కమిటీ బాధ్యులు



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన భక్తులు

షిర్డీసాయి అనుగ్రహం పీఠం ఆధ్వర్యంలో..

తెనాలి: పట్టణ నందులపేటలోని శ్రీషిర్డిసాయి అనుగ్రహ పీఠం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ఆరంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. తొలిరోజున ఉదయం గణపి పూజ, మండపారాధన, అమ్మవారి విగ్రహ స్థాపన, కలశ స్థాపన, శ్రీచక్రస్నానంతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. ప్రతిరోజూ అమ్మవారికి అభిషేకాలు, లక్ష కుంకుమార్చన, విశేష అలంకరణలు, మహామంగళ హారతి మంత్రపుష్పసహితంగా జరుగుతాయని చెప్పారు. తొలిరోజునుంచి అక్టోబరు 2వ తేదీవరకు అమ్మవారు ప్రతిరోజూ ఒక దివ్య అలంకారంతో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. 2వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారికి వివిధ రకాల పూలతో పుష్పాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ, మధ్యాహ్నం బాబావారి మహాసమాధి ఉత్సవం ఉంటాయని వివరించారు.

రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చెన్నై–విజయవాడ రైలు మార్గంలో తెనాలి మండలం ఎరుకలపూడి వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పట్టాలపై మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడు లేత వంకాయ రంగు టీ షర్టు, నీలం రంగు ట్రాక్ ఫ్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆచూకీ తెలిసిన వారు 7207076614 నంబరులో సంప్రదించాలని ఎస్ఐ వెంకటాద్రిబాబు కోరారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం



తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల ప్రకారం తెనాలి నియోజకవర్గంలో వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్ష నియామకాలను పూర్తిచేశారు. ఆయా వివరాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించిందని తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ ఆదివారం తెలిపారు. పట్టణ మున్సిపాలిటీ, తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలస్థాయిలో అనుబంధ కమిటీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

తెనాలి మున్సిపాలిటీ..

పట్టణ పరిధిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా కె.లక్ష్మయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొంగర రాగమంజీర, బీసీ సెల్ అధ్యక్షుడిగా పెదలంక వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బండ్లమూడి నాగేశ్వరరావు, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ సుభాని అలియాస్ పెచ్చింగ్ సుభాని నియమితులయ్యారు.

తెనాలి రూరల్ మండలం..

రూరల్ మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా కుర్రా జస్వంత్ యాదవ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పిల్లి ఉమాప్రశాంతి, బీసీ సెల్ అధ్యక్షుడిగా కమాదుల స్వామి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పినపాటి రవికిరణ్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఖాజా నియమితులయ్యారు.

కొల్లిపర మండలం..

కొల్లిపర మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా ఈదా యశ్వంత్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా తమ్మా సుజాతరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షుడిగా వుయ్యూరు గోపి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కనపర్తి ప్రకాష్, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ మజీద్ నియమితులయ్యారు.

పని గంటల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు



నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికుల పని గంటలను పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పాండురంగ ప్రసాద్‌రావు డిమాండ్ చేశారు. గంగానమ్మపేటలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ముఖ్యనాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు, పెన్షనర్స్ 140 సంవత్సరాల క్రితం పోరాడి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు. నూతన కార్మిక చట్టాలు, కార్మికులు, ఉద్యోగుల హక్కులను హరించేవిధంగా ఉన్నాయని ఆరోపించారు. పని గంటలు పెంచడం దారుణమన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వారానికి 35 గంటలు పని గంటలుగా ఉంటాయని చెప్పారు. పెట్టుబడిదారుల శ్రమదోపిడీలో ప్రభుత్వాలు భాగస్వామ్యం కావడం దురదృష్టకమరని ఆరోపించారు. జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నికల్లో అండగా నిలిచారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఒక సమస్య కూడా పరిష్కరించలేదని ఎద్దేవా చేశారు. ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రజాప్రతినిధులు ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం, డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైద్య బీమాను రూ.25లక్షలకు పెంచాలని కోరారు. జోన్ కన్వీనర్ పుట్టా జానర్ధరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీదా, నాయకులు సిహెచ్. లక్ష్మణ్‌కుమార్, జి.దాసు, జి.శివరామకృష్ణ, మునగా వెంకటేశ్వరరావు, యోహాన్, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివనాగేశ్వరరావు, లక్ష్మయ్య, పాపారావు, ఖుద్దూస్, తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బెర్రీ స్కూలుకు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు



తెనాలి: పట్టణ బుర్రిపాలెంరోడ్డులోని వెస్ట్‌బెర్రీ స్కూల్‌కు మరో విశిష్ట గౌరవం లభించింది. విద్యార్థి కేంద్రిత సృజనాత్మక విద్యా పద్ధతులను విజయవంతంగా అమలు చేస్తూ, విద్యలో కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకంగా నిలుస్తున్న విద్యాసంస్థగా గుర్తింపు పొందినందుకు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు – 2025ను అందుకుంది. టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో, రాష్ట్ర పౌరసరఫరాలు, ఆహార – వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మానోహర్ చేతులమీదుగా ఈ అవార్డును అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్.విజయ్ కుమార్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్ రవి చంద్ర ఈ అవార్డును స్వీకరించారు. పిల్లల ఆసక్తులు, ప్రతిభ, అభిరుచులను కేంద్రంగా సృజనాత్మక బోధనా విధానాలను అనుసరిస్తూ, అకడమిక్ విజయాలతోపాటు విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నైతిక విలువలతో కూడిన సమగ్ర వ్యక్తులుగా ఎదగటం లక్ష్యంగా విద్యాబోధనలో ఉన్న తమ స్కూలు ఈ అవార్డు రావటం ఎంతో ప్రోత్సాహకరమని ప్రిన్సిపాల్ టీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఎదగడం మా ప్రధాన లక్ష్యం. ఈ అవార్డు మాకు మరింత ప్రోత్సాహం కలిగించింది'' అని అన్నారు. తమకు సహకరిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్నాంజనేయులు మండవకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థుల 'సేవా పక్వాడా'



పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

తెనాలి: 22 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సీసీ విద్యార్థులు ఆదివారం సేవా పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్నారు. కమాండింగ్ ఆఫీసర్ ఎ.ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో 145 మంది ఎన్‌సీసీ విద్యార్థులు సేవా కార్యక్రమం చేశారు. ప్రజలలో సేవా భావాన్ని పెంచడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యంపై దృష్టి సారించడం సేవా పక్వాడ ప్రధాన ఉద్దేశంగా కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎ.ఉదయ్ కుమార్ అన్నారు. ముందుగా మున్సిపల్ బాలుర హై స్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఎన్‌సీసీ విద్యార్థులు సేవా పక్వాడ నినాదాలు చేశారు. తదుపరి పాత గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పట్టణంలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్, ఎన్‌సీఆర్ఎం హైస్కూల్, ఎస్ఆర్ఎస్ ఎంటీ హైస్కూల్, ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. 22 ఆంధ్ర బెటాలియన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ పర్యవేక్షించారు. ఎన్‌సీసీ అధికారులు పరిశా సర్దార్, కొప్పంటి స్వామి అశోక్, పీఐ స్టాఫ్ సుబేదార్ సునీల్, బీహెచ్ఎం నాగరాజు, హవల్దార్ అనంత్ పాల్గొన్నారు.

జిల్లాతో ప్రత్యేక అనుబంధం

పూర్వ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ

గుంటూరు వెస్ట్: ఇటీవల జెన్కో మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయిన గుంటూరు జిల్లా పూర్వ కలెక్టర్ ఎస్. నాగలక్ష్మిని, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ గా బదిలీ అయిన పూర్వ సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజను జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో శనివారం రాత్రి కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాలులో ఘనంగా సత్కరించారు. ఇద్దరూ మాట్లాడుతూ జిల్లాతో ప్రత్యేక అనుబంధం ఏర్పడిందని తెలిపారు. ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు తమకు ఎంతో సహకారమందించారని చెప్పారు. నూతన కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా మార్గదర్శకత్వంలో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం నాగలక్ష్మి, భార్గవ్ తేజను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్. కె ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి కె. శ్రీనివాసరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రేవేంద్రపాడులో 'వెయిట్ లిఫ్టింగ్' ఎంపికలు



దుగ్గిరాల: విద్యార్థులు చదువుతో పాటు ఆటలు కూడా ముఖ్యమని అని హెచ్.ఎం బి.వి.కృష్ణారావు చెప్పారు. మండలంలోని రేవేంద్రపాడు జెడ్పీ హైస్కూలులో ఆదివారం జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గేమ్స్ ఫెడరేషన్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో 17 నుంచి 19 సంవత్సరాల బాలబాలికల విభాగంలో ఎంపికలు జరిగినట్లు తెలిపారు. విద్యార్థులు చురుగ్గా ఉండటానికి ఆటలు ఆడాలని, దేహ దారుఢ్యం కూడా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు నాగ శిరీష, రాంబాబు, వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

99 అడుగుల మహాగణపతి కమిటీపై ఫిర్యాదు

గుంటూరు రూరల్: తమలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుకుని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారని జిల్లా ఎస్పీకి కళాకారులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బాధితుడు, శ్లోక ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గంట స్వామి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. రెడ్డిపాలెం ఇన్నర్ రింగ్ రోడ్‌లోని శ్రీ చైతన్య కళాశాల గ్రౌండ్ 99 అడుగుల మట్టి మహాగణపతిని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసింది. నగరంలో ఉన్న వివిధ సాంస్కృతిక సంస్థలతో కలసి శ్లోకా ఫౌండేషన్ ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 20 వరకు నిత్యం శాస్త్రీయ నృత్యాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహించింది. ఉత్సవాల అనంతరం కళాకారులకు సొమ్మును ఇవ్వకుండా కమిటీ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజానాయుడు, సెక్రటరీ లక్ష్మీరెడ్డిలు అందుబాటులో లేరని ఫిర్యాదు చేశారు. ఫోన్ ద్వారా కూడా సమాధానం చెప్పకుండా తప్పించుకొని వెళ్లి పోయారని ఆరోపించారు. కళాకారులు, చిన్నారులు, మహిళలు, మేకప్ మేన్‌కు రూ 1,75,000 ఇవ్వాలని తెలిపారు. వెంటనే నగదు ఇప్పించాలని స్వామి ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

సమష్టి కృషితో డివిజన్‌లో అద్భుతమైన పురోగతి

రైల్వే డివిజన్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్

లక్ష్మీపురం: అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషి ఫలితంగా గుంటూరు రైల్వే డివిజన్ అద్భుతమైన పురోగతి సాధిస్తుందని గుంటూరు రైల్వే డివిజన్ పీఆర్‌ఓ డి.వినయ్‌కాంత్ తెలిపారు. ఆదివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో ఈ ఏడాది సాధించిన విజయాలు, అభివృద్ధి వివరాలు వెల్లడించారు. 3.809 మిలియన్ టన్నుల సరకు రవాణా చేయగా రూ.712 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గతేడాది కంటే 6.1 శాతం ఎక్కువ అని తెలిపారు. నడికుడి–శ్రీకాళహస్తి లైను 309 కిలోమీటర్లు కాగా ఇప్పటి వరకు 90 కి.మీ పూర్తయిందన్నారు. ఎర్రుబాలెం–నంబూరు (56.53 కి.మీ) లైను ఏపీ రాజధాని అమరావతిని కలుపుతుందని, భూసేకరణ పురోగతిలో ఉందన్నారు. నల్లపాడు–నంద్యాల 12 కి.మీ పూర్తయిందని తెలిపారు. నవంబర్ 2025 నాటికి గురజాల–నంద్యాల పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబర్ 2026 నాటికి దిగువమెట్ట–గురజాల (40 కి.మీ) పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నల్లపాడు–పిడుగురాళ్ల 30 కి.మీ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలో 16 రైల్వేస్టేషన్లను అమృత్ భారత్ స్టేషన్‌ల పునరాభివృద్ధి కోసం రూ.300 కోట్లు మంజూరు చేసినట్లు తెలియజేశారు.

మద్యం మత్తులో వర్షం నీటిలో పడి వ్యక్తి మృతి




లక్ష్మీపురం: మద్యం మత్తులో వర్షపు నీటిలో పడి వంట మాస్టర్ మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. గుంటూరులోని ముత్యాలరెడ్డి నగర్ 1వ లైన్ ప్రాంతానికి చెందిన చింతాబత్తిన కుమార్ బాబు (35) అరండల్‌పేట 10వ లైన్‌లోని మెస్‌లో వంట మాస్టర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. భార్య దుర్గాదేవి బొంగరాల బీడు యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తోంది. కుమార్ బాబు శనివారం అర్ధరాత్రి పూటుగా మద్యం తాగి డొంక రోడ్డు మూడు వంతెనల సెంటర్ వద్ద వర్షపు నీటిలో పడి మృతి చెందాడు. స్థానికులు భార్య దుర్గాదేవికి సమాచారం తెలియజేయడంతో హుటాహుటిన చేరుకుని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. దుర్గాదేవి ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని ప్రభుత్వ సమగ్రాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

తెనాలి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం

Ph. : 08644-228093, Cell : 7207202718





దేవీ శరన్నవరాత్ర మహోత్సవ ఆహ్వానము

శ్రీ విశ్వావసునామ సంవత్సర
ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి నుండి శుద్ధ దశమి

ది. 22-9-2025 సోమవారం నుండి **ది. 2-10-2025** గురువారం వరకు

తెనాలి శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో

శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవములు

జరుగును కావున భక్తులందరు ఈ పూజా కార్యక్రమములో పాల్గొని శ్రీ అమ్మవార్ల కృపకు పాత్రుల కాలగరు.

తేదీ, వారం	తిథి	శ్రీ వాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి అలంకారములు	శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి అలంకారములు
22-09-25 సోమవారం	పాడ్యమి	శ్రీ బాలాత్రిపురసుందరీదేవి	శ్రీ మహాగౌరీదేవి
23-09-25 మంగళవారం	విదియ	శ్రీ గాయత్రీదేవి	శ్రీ భవానీదేవి
24-09-25 బుధవారం	తదియ	శ్రీ అన్నపూర్ణాదేవి	శ్రీ కాత్యాయినీదేవి
25-09-25 గురువారం	చవితి	శ్రీ లలితాత్రిపురసుందరీదేవి	శ్రీ మంగళగౌరీదేవి
26-09-25 శుక్రవారం	చవితి	శ్రీ ధనలక్ష్మీదేవి	శ్రీ గజలక్ష్మీదేవి
27-09-25 శనివారం	పంచమి	శ్రీ వారాహీదేవి	శ్రీ కామాక్షీదేవి
28-09-25 ఆదివారం	షష్ఠి	శ్రీ ప్రత్యంగిరాదేవి	శ్రీ భద్రకాళీదేవి
29-09-25 సోమవారం	సప్తమి	శ్రీ మహాసరస్వతీదేవి (మూలా నక్షత్రం)	శ్రీ రాజమాతంగీదేవి
30-09-25 మంగళవారం	అష్టమి	శ్రీ దుర్గాదేవి	శ్రీ చండికాదేవి
01-10-25 బుధవారం	నవమి	శ్రీ మహిషాసురమర్ధనీదేవి	శ్రీ మహాకాళికాదేవి
02-10-25 గురువారం	విజయదశమి	శ్రీ పుష్పశయ్యాదేవి	శ్రీ రాజరాజేశ్వరీదేవి

ది. **2-10-2025** గురువారం విజయదశమినాడు సా॥ గం॥ 6-30 నుండి
వివిధ అలంకరణలతో, వేషధారణలతో మరియు విభిన్న కార్యక్రమాలతో
అమ్మవారి దివ్య రథోత్సవము జరుగును. కావున భక్తులెల్లరు పాల్గొన కోరుచున్నాము

